సాక్షి

అన్నమయ్య జిల్లా

మంగళవారం । 2 । ఏప్రిల్ । 2024



ఎర్రచందనం స్వాధీనం

వాహనంతోపాటు రూ. 15 లక్షల విలువైన ఎర్రచందనం స్వాధీనం చేసుకుని ఓ నిందితుడిని అరెస్ట్ చేసినట్లు డీఎఫ్ఓ జె.వి. సుబ్బారెడ్డి తెలిపారు. - IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళ (సా॥)	సహర్ బుధ (ఉ॥)
రాయచోటి :	6.30	4.52
రాజంపేట :	6.32	4.52
పీలేరు :	6.35	4.46
మదనపల్లె :	6.33	4.56

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.230	రూ.300
రెండోరకం	రూ.150	రూ.220

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 83 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

వైభవం..పల్లకీ సేవ



పల్లకీలో ఊరేగుతున్న శ్రీ భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేతుడికి పల్లకీ సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం రాత్రి స్వామి, అమ్మవారిని పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించార. అనంతరం పల్లకీలో కొలువుదీర్చి మాడ వీధుల్లో ఊరేగించారు.కార్యక్రమంలో స్థానికులతోపాటు కన్నడ భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఈవో డివి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ఫలితాలు విడుదల



జవహర్ నవోదయవిద్యాలయం

రాజంపేట : ఉభయజిల్లాలకు సంబంధించి జవహర్ నవోదయ విద్యాలయ ఆరోతరగతి ప్రవేశపరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈమేరకు సోమవారం ప్రిన్సిపాల్ గీత ఒక ప్రకటనలో తెలిపారు. 20.1.2024న ప్రవేశపరీక్ష నిర్వహించారన్నారు. ఎంపికై న అభ్యర్థులు సమర్పించే ధ్రువపత్రాలు సరైనవని నిర్ధారించిన తర్వాతే వారికి ప్రవేశం కల్పించనున్నట్లు చెప్పారు. అంతవరకు బదిలీ సర్టిఫికెట్ తీసుకోవద్దని తెలిపారు. తాత్కలికంగా ఎంపికైన అభ్యర్థుల జాబితాను హెచ్‌టీటీపీఎస్‌://డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఎన్‌వీవీఓడీఏవైఏ. జీవోవీ.ఇన్/ ఎన్‌వీఎస్/ఎన్‌వీఎస్-ఎస్‌సీహెచ్‌వోవోఎల్/కెఏడీఏపీఏ/ఈఎన్/హెచ్‌వోఎంఈ/ అనే వెబ్‌సైట్‌లో చూడొచ్చని తెలిపారు.

రాములోరి కల్యాణానికి గోటి తలంబ్రాలు సిద్ధం



గోటితో వలిచిన తలంబ్రాలు తీసుకొచ్చిన సేవాసమితి సభ్యులు

ఒంటిమిట్ట : జై శ్రీరామ్ భక్తవత్సల సేవా సమితి తరఫున విజయవాడ నుంచి స్వామివారికి గోటితో వలిచిన 40 కేజీల తలంబ్రాలను రాములోరి కల్యాణానికి సిద్ధం చేసి సమర్పించారు. సోమవారం వారు మాట్లాడుతూ తాము గోటి తలంబ్రాలతోపాటు స్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలు, పసుపు కుంకుమ, పూలమాలలు, ముత్యాలు 200 గ్రాములు, ఎండుకొబ్బరి, ఖర్జూరాలు, పసుపుకొమ్ములు తీసుకొచ్చామని తెలిపారు. దేవస్థానం సిబ్బంది వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

నూతన నియామకం

పులివెందుల టౌన్ : వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శిగా రాజేశ్వరి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసినట్లు మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. పులివెందుల పట్టణానికి చెందిన రాజేశ్వరి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ సేవలు అందించారన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ అధిష్టానం నాపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. పదవీ బాధ్యతలు అప్పగించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, వైఎస్ అభిషేక్‌రెడ్డి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఉషారాణిలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పది మూల్యాంకనం ప్రారంభం

కడప ఎడ్యుకేషన్ : పది పరీక్షల సమాధాన పత్రాల మూల్యాంకనం సోమవారం వైఎస్సార్ జిల్లా కేంద్రం కడపలోని మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో క్యాంపు ఆఫీసర్ మర్రెడ్డి అనురాధ ఆధ్వర్యంలో ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల నుంచి అన్ని సబ్జెక్టులకు సంబంధించి 1,96,635 పేపర్లు వచ్చాయి. మూల్యాంకన కేంద్రాన్ని పది పరీక్షల జిల్లా అబ్జర్వర్ మార్తాల వెంకట కృష్ణారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూల్యాంకన కేంద్రంలో పేపర్లను దిద్దే సిబ్బందికి అలసత్వం తగదన్నారు. జవాబు పత్రాలను క్షుణంగా పరిశీలించి మార్కులు వేయాలన్నారు డీఈఓ, క్యాంపు ఆఫీసర్ మర్రెడ్డి అనురాధ మాట్లాడుతూ ఈ మూల్యాంకన ప్రక్రియ ఈ నెల 8వ తేదీ వరకు జరుగుతుందన్నారు.పేపర్లు దిద్దే సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను కల్పించామన్నారు. మొదటి రోజు 1,96,635 పేపర్లకు 11,963 పేపర్లను మూల్యాంకనం చేశారని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్ తెలిపారు.

సంక్షేమ సారథి.. ప్రగతి వారధి

- జిల్లాలో టీబీటీ, నాన్ డీబీటీ కింద రూ. 9450 కోట్లకు పైగా లబ్ధి
- పునర్విభజనతో ప్రగతి పరుగులు
- రాయచోటిలో అన్ని రకాలుగా పురోభివృద్ధి
- మదనపల్లెలో తలమానికంగా రూ. 500 కోట్లతో మెడికల్ కళాశాల
- పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేయనున్న సీఎం
- నేడు మదనపల్లె టిప్పు సుల్తాన్ మైదానంలో మేమంతా సిద్ధం బహిరంగ సభ



రాయచోటిలోని కలెక్టర్ కార్యాలయం

సాక్షి రాయచోటి : రాజు బాగుంటే రాజ్యం సుభిక్షంగా ఉంటుందనేది నానుడి. అందుకు తగ్గట్టుగానే అవినీతి లేని పారదర్శక పాలనే లక్ష్యంగా అడుగులు పడడంతో అభివృద్ధి తొణికిసలాడుతోంది. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధితో పాటు ఇంకోవైపు పార్టీ శ్రేణులను కార్యోన్ముఖులను చేస్తూ మేమంతా సిద్ధం అనేలా నాయకుడు ముందుండి నడిపిస్తున్నారు. అందరి అభిమాన నేత కోసం అన్నమయ్య జిల్లా ఎదురుచూస్తోంది. ఆ సమయం రానే వచ్చింది. అనంతపురం జిల్లా స రిహద్దు ప్రాంతం నుంచి ఉదయం 9 గంటలకు ములకలచెరువులోకి ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్ర ప్రవేశించనుంది.. పార్టీ శ్రేణులు, కార్యకర్తలు కూడా ఆయన పర్యటన కోసం సిద్ధమని అంటున్నారు.

'అన్నమయ్య'లో అపార అభివృద్ధి

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నమయ్య జిల్లాను పురోగతి బాట పట్టించింది. ప్రధానంగా జిల్లాలో పునర్విభజనలో భాగంగా రాజంపేట పార్లమెంట్‌ను జిల్లాగా మార్చి జిల్లా కేంద్రంగా రాయచోటిని ఎంపిక చేశారు. అంతకుముందు కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా పేదల సంక్షేమానికి పెద్దపీట వేయడమే కాకుండా ప్రత్యేకంగా వారిని కంటికిరెప్పలా కాపాడుకుంది. జిల్లా కేంద్రమైన రాయచోటిలో రూ. 25 కోట్లతో 100 పడకల ఆస్పత్రి, వెలిగల్లు ప్రాజెక్టు నుంచి రాయచోటి ప్రజల దాహార్తి తీర్చేందుకు రెండో పైపులైన్ కోసం రూ.100 కోట్లు వెచ్చిస్తోంది. పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. రాయచోటిలో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణానికి సుమారు రూ. 100 కోట్లు కేటాయించారు. అంతేకాకుండా సుమారు రూ. 8 కోట్లతో శిల్పారామం, కేంద్రీయ విద్యాలయం, పీజీ కళాశాల, మరో రూ. 3 కోట్లతో నగరవనం, ఆటలకు సంబంధించి క్రికెట్ స్టేడియం, మధ్యతరగతి ప్రజలకు సంబంధించి 50 ఎకరాల్లో ఎంఐజీ లే అవుట్, డబుల్‌రోడ్డు నిర్మాణాలు, మున్సిపాలిటీ పరిధిలో పార్కులు, నూతనంగా ఆర్టీసీ బస్టాండు, రైతు బజారు, సర్కిళ్లు, ఆర్‌అండ్‌బీ అతిథిగృహం, టౌన్ పోలీసుస్టేషన్, డీఎస్పీ కార్యాలయం, ఇంకా అనేక రకాల అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. మదనపల్లెలో మూడు ఎకరాల్లో సుమారు రూ. 500 కోట్లతో మెడికల్ కళాశాల హైలెట్‌గా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. కేంద్రీయ విద్యాలయం, మదనపల్లె వాసుల ఎన్నో ఏళ్ల కలగా ఉన్న బీటీ కళాశాలను యూనివర్సిటీ స్థాయికి తీసుకెళ్లడం, సుమారు రూ. 200 కోట్లతో గ్రామీణ ప్రాంత రోడ్లు అభివృద్ధి చేశారు. అలాగే తంబళ్లపల్లె నియోజకవర్గంలోనూ వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారు. పీలేరులో కూడా రూ. 24 కోట్లతో 100 పడకల ఆస్పత్రి, పీలేరు-తిరుపతి జాతీయ రహదారి నిర్మాణ పనులు వందలాది కోట్లతో, రైల్వేకోడూరు పరిధిలో రైల్వే అండర్ ఓవర్ బ్రిడ్జిలు, చిట్వేలి-రైల్వేకోడూరు ఫోర్‌లేన్‌రోడ్డు, రాజంపేట పరిధిలో రూ. 80 కోట్లతో పింఛా ప్రాజెక్టును దాదాపుగా పూర్తి చేశారు.

డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా లబ్ధి

అన్నమయ్య జిల్లాలో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా సుమారు రూ. 9450 కోట్ల మేర లబ్ధి చేకూరింది. అనేక రకాల పథకాల ద్వారా ప్రజలకు సంక్షేమాన్ని అందించారు. ప్రతి నియోజకవర్గానికి సుమారు రూ. 1500 కోట్ల మేర ప్రయోజనం ఒనగూరింది.

జగనన్న రాక కోసం సిద్ధం

అన్నమయ్య జిల్లాలో వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాకకోసం జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్నారు. మేమంతా సిద్ధ కార్యక్రమంలో భాగంగా పార్టీ శ్రేణులతోపాటు కార్యకర్తలను ఎన్నికలకు సిద్ధం చేసేందుకు మంగళవారం పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్రలో భాగంగా మదనపల్లెకు వస్తున్నారు. ఇప్పటికే కార్యకర్తలు, నాయకులు ఎన్నికల సమర శంఖారావం పూరించే కార్యక్రమంలో పాల్గొననున్నారు. అన్నమయ్య జిల్లాలోకి మంగళవారం ఉదయం 9 గంటల తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్ర ప్రవేశిస్తుంది. ఇప్పటికే పార్టీ శ్రేణులు, మహిళలు, పండుటాకులు సైతం ఆయనకు స్వాగతం పలికేందుకు ముందుకు కదులుతున్నారు.



రాయచోటిలోని స్టేట్ గెస్ట్‌హౌస్ భవనం

'మేమంతా సిద్ధం'కు ఏర్పాట్లు పూర్తి

మదనపల్లె : ఓ వైపు మండిపోతున్న ఎండలు..ఉక్కపోతతో, చెమటలు పట్టి తడిసిపోతున్న శరీరం... అయినా లెక్కచేయం. అభిమాన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు మేమంతా సిద్ధం అంటూ వైఎస్సార్ సీపీ శ్రేణులు ఉత్సాహంగా ముందుకెళుతున్నారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఉదయం అన్నమయ్యజిల్లాలోకి ప్రవేశించనున్నారు. సత్యసాయిజిల్లా తనకల్లు రాత్రి బస నుంచి ఉదయం జిల్లా బార్డర్ ములకలచెరువు మీదుగా మదనపల్లెలో మధ్యాహ్నం జరగనున్న భారీ బహిరంగ సభకు హాజరుకానున్నారు. ఇప్పటికే, వైఎస్సార్, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలో జరిగిన బస్సుయాత్రలో ప్రజలు జగన్‌కు కనీవినీ ఎరుగని రీతిలో స్వాగతాలు పలికి ప్రేమాభిమానాలు కనపరుస్తున్న విషయం తెలిసిందే. అంతకుమించి అన్నమయ్యజిల్లాలో అపూర్వస్వాగతం పలకాలని పార్టీ శ్రేణులు ఉవ్విళ్లూరుతున్నాయి. ఆయన రాకకోసం లక్షలాది మంది అభిమానులు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు ఎదురుచూస్తున్నారు. మదనపల్లె మేమంతా సిద్ధం సభలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు దగ్గరగా చూసేందుకు ఏర్పాటుచేసిన ర్యాంప్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. అలాగే సభా వేదిక చుట్టూ ఏర్పాటుచేసిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఫ్లెక్సీలు కనువిందు చేస్తున్నాయి.



మదనపల్లెలోని మేమంతా సిద్ధం సభా వేదిక

బస్సుయాత్రను విజయవంతం చేయండి

- 2లక్షలకు పైగా జనం హాజరవుతారనే అంచనాతో ఏర్పాట్లు
- ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి



బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్ తదితరులు

మదనపల్లె : సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సుయాత్రను అన్నమయ్య జిల్లాలో విజయవంతం చేయాలని ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి వైఎస్సార్ సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని టిప్పుసుల్తాన్ మైదానంలో మేమంతా సిద్ధం బహిరంగ సభ ఏర్పాట్లను స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఎంపీ మిథున్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మంగళవారం ఉదయం శ్రీసత్యసాయిజిల్లా బార్డర్ నుంచి బస్సుయాత్ర అన్నమయ్యజిల్లాలోకి ప్రవేశిస్తుందన్నారు. ములకలచెరువు, పెద్దపాళ్యం, గోళ్లపల్లె, అంగళ్లు మీదుగా మధ్యాహ్నం 3 గంటలకు మదనపల్లె టిప్పుసుల్తాన్ మైదానానికి చేరుకుంటుందన్నారు. అక్కడ ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభలో జననేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ప్రజలకు జరిగిన మేలును వివరిస్తారన్నారు. పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్న యుద్ధంలో పేదలపక్షాన నిలబడిన తనపై...ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను ప్రజలకు తెలియజేస్తారన్నారు. సంక్షేమ, అభివృద్ధి పాలన మళ్లీ అందించేందుకు ప్రజలందరి ఆశీర్వాదాలు కోరుతారన్నారు. మేమంతా సిద్ధం మదనపల్లె బహిరంగసభకు జిల్లావ్యాప్తంగా 2లక్షలకు పైగా ప్రజలు హాజరవుతారనే అంచనాతో, పార్కింగ్, ఇతర వసతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. మదనపల్లెలో జరుగుతున్న మేమంతా సిద్ధం బహిరంగ జిల్లా చరిత్రలో మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. వైఎస్సార్ సీపీ కుటుంబసభ్యులు బస్సుయాత్రను విజయవంతం చేయాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ..సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఎప్పుడెప్పుడు చూద్దామని, ప్రజలంతా ఎంతో ఆతృతతో ఎదురుచూస్తున్నారన్నారు. ఐదేళ్ల తమ కష్టసుఖాల్లో పాలుపంచుకుని, చెప్పిన మాట ప్రకారం పథకాలన్నింటినీ అందజేసినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపేందుకు పెద్దసంఖ్యలో సభకు తరలివచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మేమంతా సిద్ధంకు లభిస్తున్న ప్రజాస్పందనతో మళ్లీ రాష్ట్రంలో జగన్ ప్రభంజనం ఖాయమన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి మాట్లాడుతూ..2019లో ప్రజలందరి చల్లనిదీవెనలతో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ ప్రభుత్వం ఏర్పాటైందని, ఇది కొనసాగాలంటే చేయి చేయి కలవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు జింకా చలపతి, నూర్‌ఆజం, వైఎస్సార్ సీపీ నాయకులు దేశాయ్‌జయదేవ్‌రెడ్డి, మస్తాన్‌రెడ్డి, తట్టిశ్రీనివాసులురెడ్డి, గుండ్లూరురఫీ, ముబషీర్, కోటూరిఈశ్వర్, కౌన్సిలర్లు మేస్త్రీశ్రీనివాసులు, బి.ఏ.ఖాజా, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్.జగన్ బస్సు యాత్ర
భద్రతా ఏర్పాట్ల పరిశీలన

బి.కొత్తకోట/ములకలచెరువు : సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర మంగళవారం తంబళ్లపల్లె నియోజకవర్గంలో 40 కిలోమీటర్ల మేర సాగనుంది. సోమవారం రాత్రి విడిది చేసే సత్యసాయి-అన్నమయ్యజిల్లాల సరిహద్దు నుంచి యాత్ర మొదలై మదనపల్లె-తంబళ్లపల్లె నియోజకవర్గాల సరిహద్దు అమ్మచెరువు మిట్ట వరకు సాగుతుంది. దీనికోసం పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఉదయం 9 గంటలకు విడిది కేంద్రం నుంచి బస్సు యాత్ర ప్రారంభమవుతుంది. సరిహద్దు నుంచి ములకలచెరువు మండలంలోని ములకలచెరువు, పెద్దపాళ్యం, వేపూరికోట, బురకాయలకోట, బి.కొత్తకోట మండలంలోని కనికలతోపు, కోటిరెడ్డిగారిపల్లె, హార్సిలీహిల్స్‌క్రాస్, కురబకోట మండలంలోని కంటేవారిపల్లె, చెన్నామర్రిమిట్ట, రిషివ్యాలీ క్రాస్, అంగళ్లు మీదుగా విశ్వం కళాశాల వద్దకు మధ్యాహ్నం 12 గంటలకు చేరుకుంటారు. విరామం తర్వాత సాయంత్రం 4 గంటలకు యాత్ర మొదలై సర్కారుతోపు మీదుగా అమ్మచెరువుమిట్టకు అక్కడికి సమీపంలోని మదనపల్లె టిప్పు మైదానం చేరుకుంటుంది. ఈ యాత్రకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లను సోమవారం ఎస్పీ కృష్ణారావు పరిశీలించారు. విడిది ప్రాంతం నుంచి అన్నమయ్యజిల్లా అడుగుల దూరంలోనే ఉండటంతో ఎస్పీ, స్థానిక పోలీసు అధికారులతో పరిశీలనలు జరిపి సూచనలు చేసారు. భద్రతాపరమైన లోపాలు తలెత్తకుండా జాగ్రత్తలు వహించాలని కోరారు.



సీఎం వైఎస్ జగన్ బస చేసే శిబిరం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు

ముచ్చటగా మూడోసారి

సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తంబళ్లపల్లె నియోజకవర్గంలో మూడోసారి పర్యటిస్తున్నారు. 2014 జనవరి 5న బి.కొత్తకోట, కురబలకోట మండలాల్లో పర్యటించారు. 2017 డిసెంబర్‌లో ప్రజా సంకల్ప పాదయాత్ర తంబళ్లపల్లె, కురబలకోట మండలాల్లో సాగింది. ప్రస్తుతం సీఎం హోదాలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సు యాత్ర ద్వారా ములకలచెరువు, బి.కొత్తకోట, కురబలకోట మండలాల్లో పర్యటించనున్నారు.

పశువుల్లోనూ అద్దె గర్భం

- ప్రయోగాత్మకంగా జిల్లాలో అమలుకు శ్రీకారం
- జాతి పశువులు అంతరించి పోకుండా కాపాడేందుకు సరోగసి

కడప అగ్రికల్చర్ : ఇప్పటి వరకు మనుషులు మాత్రమే అద్దెగర్భం(సరోగసీ) విధానంలో పిల్లలను కనడం విన్నాం. అయితే తాజాగా పశువుల్లోనూ ఈ విధానానికి శ్రీకారం చుట్టారు. జాతి పశువుల సంతతిని పెంచేందుకు ప్రభుత్వం, అధికారులు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా నాణ్యమైన పశువుల వీర్యాన్ని సేకరించి పిండాభివృద్ధి చేస్తున్నారు. దీనిని పశువుల గర్భంలోకి ఎక్కించి దూడలకు జన్మనిచ్చేలా చేస్తున్నారు. ఇందుకు సంబంధించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో చింతలదీవి, గుంటూరు లా ఫామ్‌లో మేలు జాతి పశువుల వీర్యంతో పిండాలను అభివృద్ధి చేస్తున్నారు. ఈ పిండాలను ఎంపిక చేసిన నాటు పశువుల గర్భంలో పెట్టడం ద్వారా స్వచ్ఛమైన జాతి దూడలు అభివృద్ధి చెందనున్నాయి. ఇందులో ఒక పిండం పూర్తి ధర రూ. 10 వేలు ఉండగా ప్రస్తుతం ప్రయోగాత్మకంగా రైతులకు ఉచితంగా వేస్తున్నారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో కూడా ఈ ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకోసం రైల్వే కోడూరులో డాక్టర్ ప్రతాప్, రాయచోటిలో డాక్టర్ జగన్నాథరెడ్డి, పులివెందుల్లో డాక్టర్ హరికౌశల్‌కు శిక్షణ కూడా ఇచ్చారు.

పెరిగిన సాంకేతికత...

పశుసంవర్ధశాఖలో సాంకేతికత పెరుగుతోంది. మొన్నటి వరకు కృత్రిమ గర్భధారణతో నాటు పశువుల్లో మేలు జాతి దూడలు అభివృద్ధి చేశారు.



పుంగనూరు జాతి దూడ, ఆవు

ఇటీవల లింగ నిర్ధారిత వీర్యంతో 95 శాతం పెయ్య దూడలే పుట్టేలా చర్యలు చేపట్టారు. తాజాగా మేలు జాతి పశువుల వీర్యంతో అభివృద్ధి చేసిన పిండాలను గర్భంలోకి ప్రవేశపెట్టే సాంకేతికత కూడా అందుబాటులోకి తెచ్చింది. నాటు పశువులకు పిండమార్పిడి ద్వారా వందశాతం స్వచ్ఛమైన జాతి దూడలే పుడుతుండటం విశేషం.

పిండమార్పిడికి అవసరమైన నాటు ఆవులను గుర్తించి సిద్ధం చేసుకోవాలి. ఎదకు వచ్చి ఎద ఆరిపోయిన ఏడో రోజు నాటు ఆవుల గర్భంలోకి పిండాన్ని బదిలీ చేస్తారు. ఇన్‌ఫెమినేసన్ గన్ ద్వారా గర్భంలోకి పిండాన్ని ప్రవేశ పెడతారు. గర్భకాలంలో ఎటువంటి మార్పు ఉండదు. ఆవులు 9 నెలల 9 రోజులకు, బర్రెలు 10 నెలల 10 రోజులకు ఈతకు వస్తాయి, అద్దెగర్భంలో 100 శాతం జాతి పెయ్య దూడలే పుడతాయి. రెండు, మూడు దశాబ్దాలతో పోలిస్తే జాతి పశువుల సంతతి తగ్గిపోతోంది. ఒంగోలు, గిర్, సాహివాల్ వంటి జాతి పశువుల సంతతిని, పాల ఉత్పత్తిని పెంచేందుకు అద్దెగర్భం తోడ్పడుతోందని అధికార యంత్రాంగం స్పష్టం చేస్తోంది.

ఇప్పటి వరకు...

ఉమ్మడి వైఎస్సార్‌జిల్లాలో రైల్వే కోడూరు మండలంలో 30 పశువులను అద్దె గర్భం కోసం గుర్తించారు. వీటిలో ఇప్పటి వరకు 25 వాటికి అద్దె గర్భంలో పిండాలను వదిలారు. ఇందులో భాగంగా శెట్టిగుంటకు చెందిన హరి అనే రైతుకు చెందిన నాటు ఆవు గర్భంలో 2023 మార్చి 4న ఏడు రోజుల వయసున్న ఘనీకృత పుంగనూరు జాతి పిండాన్ని అద్దె గర్భంలో ఉచితంగా ప్రవేశ పెట్టారు. ఇందుకు సంబంధించి రైతులకు 2500 విలువ చేసే దాణా, ఖనిజ లవణాలను ఉచితంగా అందజేశారు. సంబంధిత పశువు 2023 డిసెంబర్ 17న మేలు జాతి పుంగనూరు జాతి కొడె దూడకు జన్మనిచ్చింది. మరో రైతులకు సంబంధించిన ఆవుకు మెర్ర జాతి దూడ జన్మించింది.

దేశంలోనే మొదటిసారిగా నాటు ఆవుకు పుంగనూరు జాతి దూడ పుట్టినట్లు పశువైద్యాధికారులు తెలిపారు. ఇందుకు గుర్తుగా పశుసంవర్ధకశాఖ ఈ దూడ ఫొటోతో టేబుల్ క్యాలెండర్‌ను ముద్రించినట్లు తెలిపారు.పులివెందుల్లో ఐదు, రాయచోటిలో ఐదు పశువులను గుర్తించారు. వీటిలో కూడా త్వరలో అద్దె గర్భంలో పిండాలను వదలనున్నారు.

చక్కటి అవకాశం...



మేలు జాతి పశువుల అభివృద్ధికి సరోగసి చక్కటి అవకాశం. ఇంతవరకు లింగనిర్ధారణ వీర్యంతో కృత్రిమ గర్భధారణ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. తాజాగా అద్దెగర్భంతో జాతి దూడలకు జన్మనిచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ఉమ్మడి వైఎస్సార్‌జిల్లాలో రైల్వేకోడూరు, పులివెందుల, రాయచోటిలో ఈ కార్యక్రమం నడస్తుంది. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ రమేష్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహణాధికారి వైఎస్సార్‌జిల్లా.

165 మేలు జాతి పెయ్య దూడల అభివృద్ధి

లింగనిర్ధారణ వీర్యానికి సంబంధించి ఇప్పటిదాకా జిల్లాకు 5500 డోసులు వచ్చాయి. ఇందులో 2 వేల డోసులతో ఆవులు, నాటు బర్రెలకు కృత్రిమ గర్భధారణ చేశారు. వాటికి సంబంధించి ఇప్పటి వరకు 175 దూడలు జన్మించగా ఇందులో 165 పెయ్య దూడలు జన్మించడం విశేషం. రానున్న రోజుల్లో లింగనిర్ధారణ వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేసే కార్యక్రమాన్ని చేపడుతూనే మరో వైపు అద్దె గర్భంతో జాతి పశువులను అభివృద్ధి చేసే ప్రక్రియను కూడా చేపట్టనున్నారు.

అవ్వాతాతలకు చంద్ర గ్రహణం



ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటి ముందు ప్రత్యక్షమయ్యే వలంటీర్ ఈసారి రాలేదు.. వేకువనే ఠంచన్‌గా వచ్చే పింఛన్ అందలేదు.. ఆత్మగౌరవానికి రక్షణగా నిలిచే నగదు చేతికందలేదు.. ఎవరిపై ఆధారపడాల్సిన పనిలేకుండా సగర్వంగా జీవించే భరోసా కల్పించిన సొమ్ము కనుచూపు మేర కనిపించలేదు. ఈ నెల మందులు ఎలా కొనుగోలు చేసుకోవాలి.. కనీస అవసరాలకు ఎవరి కాళ్లావేళ్లా పడాలి.. పండుటాకుల కళ్లలో తీరని ఆవేదన. కేవలం స్వార్థ రాజకీయాల కోసం చంద్రబాబు తమ బతుకులను ఫణంగా పెట్టారని మనసులో ఆగ్రహం. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు.. బారులు తీరి గంటల తరబడి ఎదురుచూపులు.. మళ్లీ మొదలయ్యాయనే ఆవేదన వృద్ధులు, దివ్యాంగులు వ్యక్తం చేస్తున్నారు.

ఇంటికాడికి పింఛన్ రాలా..!



ప్రతి నెలా ఒకటోతేదీ రాంగానే మా వీధిలోని వలంటీర్ బాబు ఇంటికాడికి వచ్చి తలుపుతట్టి, మంచంలోనే ఉన్న నన్ను లేపి అవ్వా .పింఛన్ తీసుకో అంటూ ఇచ్చేవోడు. ఈనెల ఒకటోతేదీ వచ్చిందిగానీ పంఛన్ చేతికి రాకపోయే. ఎందుకో తెలియట్ల. ఎప్పుడు ఇస్తారో తెలియట్ల. సారూ....మా ఇంటికాడికి ఫించన్ పంపండి. దాదాపు 15 సంవత్సరాలుగా వృద్ధప్యఫించన్ పొందుతున్న రాజమ్మ గత మూడు సంవత్సరాలుగా అనారోగ్యంతో మంచానికే పరిమితమైంది. ఫించన్ కోసం ఇప్పుడు ఎక్కడికి వెళ్లాలో తెలియక అయోమయంలో ఉంది.

-రాజమ్మ, పెద్దమాదిగపల్లె,నిమ్మనపల్లె మండలం

పింఛన్ ఎప్పుడు ఇస్తారు నాయనా..



ఒకటోతేదీ వచ్చింది. ఫించన్ రాలేదు. ఎప్పుడు ఇస్తారు నాయనా.. ఎందుకు మా ఇంటి దగ్గరికి వలంటీరు పింఛన్ ఇచ్చేందుకు రాలేదు. మా పింఛన్ ఏమైంది... ఫించను కోసం యవోరిని అడగాలి. యాడికి పోవాలి అంటూ వృద్ధప్య పెన్షన్ లబ్ధిదారు వై.నారాయణమ్మ పింఛన్ అందకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తోంది. పది సంవత్సరాలుగా మంచానికి పరిమితమైన తనలాంటి వారికోసమైనా వలంటీర్ల సేవలు కొనసాగించాలి కోరుతోంది. 80 సంవత్సరాల వయస్సులో మంచానికి పరిమితమై ఫించన్ కోసం ఎదురు చూస్తోంది.

-వై.నారాణమ్మ, చౌకిళ్లవారిపల్లె, నిమ్మనపల్లె మండలం

పింఛన్ కోసం యాడికి వెళ్లాలి



నెలనెలా ఒకటో తేదీ వస్తావుంటేనే వలంటీరు మా ఇంటికి వచ్చి ఫించన్ ఇచ్చేవాడు. మరి ఈనెల వలంటీరు రాలా... ఫించన్ రాలా. ఎందుకో ..ఎవరు చెప్పటం లేదు. ఫించన్ ఎప్పుడు ఇస్తారో ఎక్కడికి వెళ్లాలో తెలీలా.మా ఊరి నుంచి రెండున్నకిలోమీటర్ల దూరంలోని ఆఫీసుకు వెళ్లాలని చెబుతావున్నాడారు. నాకు 70 సంవత్సరాలు. అంతదూరం పోవాలంటే నడవలేను. జగనన్న వచ్చాక ఫించన్ ఇంటికే వచ్చేది. మళ్లీ పాత కష్టాలు మొదలయ్యాయి. అధికారులు దయ చూపి ఫించన్ ఇంటికి వచ్చేలా చేయాలి.

-జె.జయమ్మ, దిగువపల్లె, ముష్టూరు పంచాయతీ, నిమ్మనపల్లె మండలం

రాజకీయ రంగు పులమడం సరికాదు..



సేవాభావంతో పని చేసే మాపై రాజకీయ రంగు పులమడం సరికాదు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పని చేసి ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా లబ్ధిదారులకు అందించేందుకు కృషి చేసే వారము. ఎన్నికల నేపథ్యంలో తామేదో అధికార పార్టీకి అనుకూలంగా ఉన్నట్లు రాజకీయ రంగు పులమడం సరికాదు.

- బాబురాజేంద్రప్రసాద్, వలంటీరు, పీలేరు

పేదలంటే చంద్రబాబుకు ఎందుకంత వివక్ష

ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి టౌన్ : చంద్రబాబు తన కోవర్టు నిమ్మగడ్డ రమేష్ ద్వారా కోర్టులో పిటిషన్ వేయించి పెన్షన్లు వలంటీర్లు ఇవ్వకూడదన్న ఆర్డర్ తీసుకురావడం వల్ల అవ్వాతాతలు, నడవలేనివారు, వికలాంగులు 1వ తేదీ వచ్చినా పింఛన్ అందుకోలేక ఆందోళనలో ఉన్నారన్నారు.చంద్రబాబూ పేదలంటే ఎందుకీ వివక్ష అని ఆయన నిలదీశారు. సోమవారం ఇంటింటి ప్రచారంలో భాగంగా శిబ్యాల గ్రామంలో మీడియా సమావేశం నిర్వహించారు. పేదప్రజలకు మంచి చేసేటప్పుడు సంతోషపడాలి కానీ.. ఈర్ష పడకూడదన్నారు. నిమ్మగడ్డ తీసుకొచ్చిన కోర్టు తీర్పుతో పింఛన్‌దారులు తీవ్ర నిరుత్సాహంలో ఉన్నారని శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ప్రజలకు చేదోడు వాదోడుగా నిలిచే వ్యవస్థలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొస్తే, టీడీపీ, జనసేన నాయకులు ఓర్వలేకపోయారన్నారు.వలంటీర్లను ఉగ్రవాదులని, హ్యూమన్ ట్రాఫికింగ్ చేస్తున్నారని తీవ్ర విమర్శించి, వారి మనస్సులు గాయపరిచారన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఒకటో తేదీ తెల్లవారక ముందే పెన్షన్ ఇచ్చే వారన్నారు. నిమ్మగడ్డ కోర్టుకు వెళ్లి స్టే తీసుకరావడంతో అవ్వాతాతలు, వికలాంగులు, వితంతువులు ఇ తీవ్ర ఇబ్బందులకు గురి అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్ సొమ్మును అవ్వాతాతలు, మందుల కోసం, ఇంటి సరుకులు కోసం ఉపయోగించుకొనే వారన్నారు. కానీ వారు తీసుకొచ్చిన కోర్టు తీర్పుతో ఆగిపోయిందన్నారు. శాంతి భద్రతలను కాపాడేందుకు పోలీస్ వ్యవస్థను పట్టిష్టపరిచామని చెప్పారు. ప్రజలకు ఇన్ని రకాల ఇబ్బందులు కలిగిస్తున్న చంద్రబాబు ఇప్పుడు జయహో బీసీ సభలు నిర్వహిస్తున్నారని, ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడానికి ఆయనకు సిగ్గు ఉండాలని విమర్శించారు. స్వతంత్ర్యం ఇచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు బీసీలకు సముచిత స్థానం కల్పించి కెబినెట్ పదవులు, నామినేటెడ్ పదవులు అత్యధిక శాతం ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ఇదే విషయాన్ని ఆర్.కృష్ణయ్య, జస్టిస్ ఈశ్వరయ్య కూడా చెప్పారని గుర్తు చేశారు.కరోనా సమయంలో కోవిడ్ కేర్ సెంటర్ ఏర్పాటు చేసి ఆక్సిజన్ మిషన్లు, ఆక్సిజన్ సిలిండర్లు అవసరమైన వారికి అందించామని, ఆ సమయంలో వారితో దగ్గరగా ఉంటూ వారి యోగక్షేమాలు చూశామన్నారు. ఆ రోజూ వీరు ఎవరూ దగ్గరకు కూడా రాలేదని గుర్తు చేశారు.ప్రజలకు జగన్ పాలనలో మేలు జరిగింది కాబట్టే ధైర్యంగా ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీకి ఉందన్నారు. గతంలో ఎవరూ కూడా మేనిఫెస్టో గురించి ఆలోచన చేసేవారు కాదని,మేనిఫెస్టో మీద నమ్మకం కుదిర్చిన వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. మేనిఫెస్టో గురించి ప్రజలకు చేప్పాడంటే, చేస్తాడంతే అని నమ్మకం కల్గించి జగన్ క్రెడిబులిటీ సాధించారన్నారు. చంద్రబాబు మేనిఫెస్టో అంటే ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు.ఎన్నికల ముందు అల్ ఫ్రీ అంటాడు, తర్వాత పట్టించకోడు అన్న భావన ప్రజల్లో ఉందన్నారు.కరువును పారదోలేందుకు కృష్ణా జలాలు కాలేటి వాగుకు తీసుకొస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, ఏపీఐఐసీ డైరెక్టర్ రాయవరం శ్రీనివాసుల రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు రెడ్డి, మండల బీసీ నాయకుడు పల్లపు రమేష్, కౌన్సిలర్ కొనిరెడ్డి వెంకట నరసింహారెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా సభ్యులు దిన్నెపాడు రవిరాజు, రాజేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న సర్కారు బడుల రూపురేఖలు మార్చేశారు.. పేదలకు సొంతింటి కల సాకారం చేస్తున్నారు. సచివాలయాల ద్వారా క్షణాల్లో ప్రతి పని జరుగుతోంది. ఫలితంగా పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదవాడి సొంతింటి కల నెరవేర్చాలనే ఉద్దేశంతో నాకు ఇల్లు మంజూరు చేశారు. గతంలో ఇల్లు లేక ఇబ్బంది పడుతుండే దాన్ని. ఇంతకు ముందు ఎన్నోసార్లు ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నాను. అయినా ప్రయోజనం లేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత నా సొంతింటి కల నేరవేరింది. జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

- కె.ఈశ్వరమ్మ, నాగిరెడ్డిగారిపల్లె పంచాయతీ, గోరావాండ్లపల్లె, సంబేపల్లె మండలం, అన్నమయ్య జిల్లా

రూపాయి ఖర్చు లేకుండా ధ్రువీకరణ పత్రాలు



రూపాయి ఖర్చు లేకుండా ధ్రువీకరణ పత్రాలు వచ్చాయి. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సచివాలయంలోనే ఇస్తున్నట్లు మా వలంటీర్ ధనుంజయ చెప్పడంతో దరఖాస్తు చేసుకున్నాను. దరఖాస్తు చేసుకున్న రెండు రోజుల్లోనే ధ్రువీకరణ పత్రాలు వచ్చినట్లు వలంటీర్ ద్వారా తెలిసింది. సచివాలయం వద్దకు వెళ్లి తెచ్చుకున్నాను. గతంలో ధ్రువీకరణ పత్రాల కోసం మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరిగినా కాని వచ్చేవి కాదు. జగనన్న ప్రభుత్వం వచ్చాక వలంటీర్ ద్వారా అన్ని పథకాలు ఇంటి వద్దకే వస్తుండటం సంతోషంగా ఉంది.

- కె.ఊర్మిళాదేవి, సీఎం కొత్తపల్లె, సంబేపల్లె మండలం.

ప్రణాళికాబద్ధంగా పోస్టల్ బ్యాలెట్ నిర్వహణ

రాయచోటి : అన్నమయ్య జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ నిర్వహణకు ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ రూపొందించుకొని ముందుకెళుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. బుధవారం విజయవాడలోని రాష్ట్ర సచివాలయం నుంచి పోస్టల్‌బ్యాలెట్, హోం ఓటింగ్‌కు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలు, అధికారుల బాధ్యతలు, వారు నిర్వహించాల్సిన విధులపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ జిల్లాలో పారదర్శకంగా పోస్టల్ బ్యాలెట్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ అండ్ హోం ఓటింగ్‌కు సంబంధించి ఏప్రిల్, మే మాసాలలో తేదీల వారీగా నిర్వహించాల్సిన కార్యక్రమాలపై తగిన కార్యాచరణను రూపొందించాలని సూచించారు. ఎన్నికల విధులు నిర్వహించే పీఓ, ఏపీఓ, ఓపీఓ, మైక్రో అబ్జర్వర్లు, పోలీసులు, ఇతర ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాలు కల్పించడం, అందుకు అవసరమైన ఫెసిలిటేషన్ సెంటర్ల ఏర్పాటు తదితర అంశాలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. డీఆర్ఓ సత్యనారాయణ, వివిధ జిల్లా నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అభిషిక్త్ కిషోర్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, అన్నమయ్య జిల్లా

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

వేసవిలో జిల్లా వ్యాప్తంగా ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. సోమవారం విజయవాడ, వెలగపూడి సచివాలయం నుంచి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ తాగునీటీ సరఫరా, పింఛన్ల పంపిణీ, తదితర అంశాలన్నీ జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. భూగర్భ జలాలు అడుగంటిపోయాయని, వచ్చే రెండు, మూడు నెలలు చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు.నీటి సమస్యపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీడీఓలు ముందుగానే ప్రతి స్కీమ్‌ను పరిశీలన చేసి అవి పనిచేసేలా చూడాల్సారు. తాగునీటి కోసం విద్యుత్ సమస్య రాకుండా ఎప్పటికప్పుడు ఏపీఎస్పీడీసీఎల్ అధికారులతో సంప్రదించాలన్నారు.

రూ. 2.26 లక్షల పెన్షన్లు..

అన్నమయ్య జిల్లాలో మొత్తం 2.26 లక్షల పెన్షన్లు పంపిణీ చేయాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పెన్షన్ల పంపిణీకి సంబంధించి త్వరలో నూతన మార్గదర్శకాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. మార్చి 31వ తేదీ ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా ఏప్రిల్ 1వ తేదీ ఇవ్వాల్సిన పింఛన్లు 3వ తేదీ మధ్యాహ్నం లేదా 4వ తేదీ ఉదయం నుంచి ఇవ్వనున్నట్లు చెప్పారు. మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా అర్హులైన పేదలందరికీ జాబ్ కార్డులు మంజూరు చేసి పని కల్పించాలన్నారు. పనిచేసే ప్రాంతాలలో కూలీలకు నీరు, షామియానా, ఫస్ట్ ఎడియ్ బాక్స్ వంటి అన్ని వసతులు ఉండేటట్లు చూడాలన్నారు.

పిచ్చి కుక్క దాడిలో వృద్ధుడికి గాయాలు

మదనపల్లె : పిచ్చికుక్క దాడిలో వృద్ధుడు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. బీరంగి పంచాయతీ కసింపల్లెకు చెందిన చెవిరెడ్డి (85) ఉదయం పొలం వద్ద ఉండగా అకస్మాత్తుగా వచ్చిన పిచ్చి కుక్క ఒక్కసారిగా ఆయనపై దాడి చేసింది. విచక్షణారహితంగా కాళ్లు, చేతులపై కరిచింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తర లించారు. చికిత్స అనంతరం అతడు కోలుకుంటున్నాడు.



పిచ్చికుక్క దాడిలో గాయపడిన చెవిరెడ్డి

టిప్పర్, ఆటో ఢీ

మహిళ మృతి

రాజంపేట : రాజంపేట-నెల్లూరు రహదారిలోని పోలి సమీపంలో మంగళవారం టిప్పర్, ఆటో ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలో రాజంపేటకు వస్తున్న అత్తిరాలకు చెందిన టి.వెంకటలక్ష్మి(30) అక్కడికక్కడే మృతిచెందింది. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం రాజంపేట ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. మన్నూరు ఏఎస్ఐ సుబ్బయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన వెంకటలక్ష్మి


ఆటో ఢీకొని కూలీ దుర్మరణం


ఇద్దరు కూలీలకు తీవ్ర గాయాలు

మదనపల్లె: బైకును ఆటో ఢీకొన్న సంఘటనలో ఓ కూలీ మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం రాత్రి పుంగనూరు -మదనపల్లె మార్గంలో జరిగింది. సోమల మండలం పెద్ద ఉప్పరపల్లికి చెందిన రమణ(45) కూలి పనుల నిమిత్తం మదనపల్లి మండలం, వలసపల్లి పంచాయతీ అరవవాండ్లపల్లికు వచ్చాడు. స్థానికులైన పి.లక్ష్మినరసింహులు (35) భాస్కర్(35)లతో కలిసి పుంగనూరు వద్ద చింతకాయలు కోసేందుకు కూలి పనులకు వెళ్లారు. పనులు ముగించుకుని రాత్రి ద్విచక్ర వాహనంలో ముగ్గురు కలిసి అరవవాండ్లపల్లికి బయలుదేరారు. మదనపల్లి- పుంగనూరు మార్గంలోని పుంగనూరు మండలం అక్కింవారిపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో బైకు నడుపుతున్న లక్ష్మినరసింహులు కడుపులోకి ఆటోలోని ఇనుప రాడ్లు దిగబడడంతో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అతనితోపాటు ద్విచక్ర వాహనంలో ఉన్న భాస్కర్, రమణ తీవ్రంగా గాయపడ్డారు. బాధితులు ఆటోలో ఇరుక్కుపోయి ఉండడంతో స్థానికులు వారిని బయటకు తీశారు. బాధితులను 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి లక్ష్మీనరసింహులు మృతి చెందాడు. పుంగనూరు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు



ఆటో ఢీకొని మృతి చెందిన లక్ష్మి నరసింహులు





గాయపడిన భాస్కర్, రమణ

రూ. 15 లక్షల విలువైన ఎర్రచందనం స్వాధీనం

పీలేరు : వాహనంతోపాటు రూ. 15 లక్షల విలువైన ఎర్రచందనం స్వాధీనం చేసుకుని ఓ నిందితుడిని అరెస్ట్ చేసినట్లు డీఎఫ్ఓ జె.వి. సుబ్బారెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఫారెస్ట్ అధికారులకు అందిన రహస్య సమాచారం మేరకు ఆదివారం రాత్రి నుంచి సోమల మండలం కందూరు వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. సోమవారం తెల్లవారుజామున కలికిరి వైపు నుంచి వచ్చిన కారును అటవీ సిబ్బంది ఆపే ప్రయత్నం చేశారు. అయితే వాహనాన్ని ఆపకుండా వేగంగా చౌడేపల్లె వైపు వెళ్లడంతో సిబ్బంది అప్రమత్తమై వెంబడించారు. రాయలపేట వద్ద కారును అడ్డగించగా అందులో ముగ్గురు పరారు కాగా ఒక నిందితుడు పట్టుబడ్డాడు. కారును పరిశీలించగా 345 కేజీల బరువు గల పది ఎర్రచందనం దుంగలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ నిందితుడు తమిళనాడు రాష్ఠం జమునముత్తూరుకు చెందిన తాతన్‌గా గుర్తించారు. ఈ దాడిలో అటవీ సిబ్బంది వెంకటరమణ, ప్రతాప్, చరణ్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.



వాహనం, ఎర్రచందనం దుంగలు, నిందితుడితో ఫారెస్ట్ అధికారులు

వాహనాల తనిఖీలో రూ. 22 లక్షలు స్వాధీనం

పీలేరు రూరల్ : పీలేరు నియోజకవర్గంలో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన ఘటనల్లో రూ. 22 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ ఎస్. మహబూబ్‌బాషా తెలిపారు. వాల్మీకిపురంలో వాహనాల తనిఖీలో భాగంగా రూ. 2.50 లక్షలు, దుర్గంవారిపల్లె సమీపంలో రూ. 18.50 లక్షలు విలువ గల వెండి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే పీలేరులో రూ. 1 లక్ష స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిబంధనలు ఉల్లంఘించి ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు, విలువైన వస్తువులు తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రాణం తీసిన పచ్చిమిరపకాయ గొడవ

భర్త మాటలకు మనస్థాపం చెంది ఆత్మహత్య

మదనపల్లె : భార్యాభర్తల మధ్య పచ్చిమిరపకాయల విషయమై జరిగిన వాగ్వాదం చివరకు భార్య ఆత్మహత్యకు దారితీసింది. మదనపల్లె మండలంలో జరిగిన ఈ సంఘటన వివరాలు ఇలా.. వాల్మీకిపురం మండలం జెర్రావారిపల్లె పంచాయతీ కొత్తపల్లెకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, కవిత(37) దంపతులు స్థానిక తట్టివారిపల్లె క్రాస్‌లో నివాసం ఉంటున్నారు. చంద్రశేఖర్‌రెడ్డి చిరు వ్యాపారం చేసేవాడు. సోమవారం మధ్యాహ్నం భర్త ఇంటికి పచ్చిమిరపకాయలు తీసుకెళ్లాడు. ఇప్పటికే ఇంట్లో పచ్చిమిరపకాయలు ఉన్నాయి కదా మళ్లీ ఎందుకు తెచ్చావు అంటూ భర్తపై కవిత కోప్పడింది. దీంతో భర్త కూడా ఆమెను గట్టిగా దబాయించడంతో తీవ్ర మనస్థాపానికి గురైంది. ఈ నేపథ్యంలో ఆమె ఇంట్లో నుంచి వెళ్లిపోయి నేరుగా సీటీఎం గ్రామం ఆంజనేయ స్వామి గుడి పక్కనున్న రైల్వేట్రాక్‌పై తిరుపతి- గుంతకల్లు ప్యాసింజర్ రైలుకు ఎదురుగా వెళ్లడంతో క్షణాల్లో ప్రాణాలు కోల్పోయింది. గమనించిన లోకోపైలట్ సీటీఎం రైల్వే స్టేషన్ అధికారులకు సమాచారం అందించారు. కదిరి రైల్వే ఎస్ఐ రహీం , హెడ్ కానిస్టేబుల్ బాబునాయక్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వాల్మీకిపురం ప్రభుత్వకమ్యూనిటీ వైద్యశాలకు తరలించారు.



రైలు కిందపడి మృతి చెందిన మహిళ

